సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



నేడు తొలేళ్ల సంబరం

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది.

- 8లో



దురుసు ప్రవర్తన వద్దు

విజయనగర ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవం సందర్భంగా సిబ్బంది భక్తులతో దురుసుగా ప్రవర్తించరాదని ఎస్పీ ఎం.దీపిక సూచించారు.

- 8లో



'మెరుగై'న సేవకులు

శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆభరణాలకు మెరుగులు దిద్దేందుకు స్వర్ణకారులు రంగంలోకి దిగారు.

- 8లో

న్యూస్‌రీల్

స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి : డీఈఓ

పార్వతీపురం టౌన్: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్‌షిప్ ఎన్‌ఎంఎంఎస్ 2023 సంవత్సరానికి ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్య, మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ వివరాలను తప్పులు లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా ఆధార్, బ్యాంక్ పాస్ బుక్కుల్లో ఉండే విధంగా పోర్టల్‌లో నవంబర్ 30లోగా నమోదు చేయాలని ఆయన సూచించారు. సంబంధిత పాఠశాలల మోడల్ అధికారి డిసెంబర్ 15వ తేదీలోగా క్షుణ్ణంగా పరిశీలించి వివరాల నమోదు తీరును చూడాలని తెలిపారు. నమోదు చేసిన అప్లికేషన్‌ను ప్రింట్ తీసి దాంతో పాటు స్టడీ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు, ఎకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజీ జతపరచి డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. జిల్లా మోడల్ అధికారి లాగిన్ ద్వారా వెరిఫై చేయించుకున్న అప్లికేషన్లకు మాత్రమే స్కాలర్‌షిప్ మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరాలలో ఈ పరీక్షకు ఎంపికై ప్రస్తుతం 10, 11, 12 తరగతులు చదువుతూ అర్హత కలిగిన ప్రతీ విద్యార్థి ఈ సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

డిసెంబర్ 11 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' : డీఎస్‌డీఓ



డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం డిసెంబర్ 11 నుంచి జనవరి 15వ తేదీ వరకు జరుగుతుందని డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన క్రీడా సామగ్రి జిల్లా కేంద్రానికి చేరుకున్నాయన్నారు. ఫిట్ ఆంధ్రా ధ్యేయంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామం, ప్రాంతంలో గల స్థానిక క్రీడలతో సహా మూడు కిలోమీటర్ల మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి క్రీడలు ముఖ్యంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను పురుషులు, మహిళలకు నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన అభ్యర్థులు క్రీడలలో పాల్గొనవచ్చన్నారు. గుర్తింపు కార్డుగా ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు చూపించాలని ఆయన సూచించారు. క్రీడలలో పాల్గొనే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రాత్రిపూట గస్తీ పెంపు

- జిల్లా అటవీ శాఖాధికారిణి ప్రసూన



దళాయివలస మెట్టలో సంచరిస్తున్న ఏనుగు

పార్వతీపురం/కొమరాడ: ఏనుగుల సంచారం దృష్ట్యా రాత్రి వేళల్లో గస్తీని పెంపు చేశామని జిల్లా అటవీ శాఖాధికారిణి జీపీపీ ప్రసూన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఒంటరి ఏనుగు 'హరి' సుదూర ప్రాంతం సంచరించి పార్వతీపురం పట్టణం మీదుగా కొత్త దారిలో అంకులవలస చేరుకుందన్నారు. తన ప్రయాణంలో ఎలాంటి నష్టం కలిగించలేదన్నారు. 17 మంది ట్రాకర్లు రెండు బృందాలుగా రేయింబవళ్లు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఏనుగు కొత్త ప్రాంతాల గుండా ప్రయాణిస్తుందని, ఎవరూ బయట నిద్రించరాదన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైల్వే ట్రాక్‌ల సమీపంలో ఏనుగులు సంచరిస్తుండటంతో రైల్వే శాఖను అప్రమత్తం చేశామన్నారు. ఏడు ఏనుగుల గుంపు గరుగుబిల్లి మండలం గొట్టివలస నుంచి దళాయివలస మెట్టకు వెళ్లాయని, దళాయివలస చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అటవీ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఏనుగుల సంచారంపై పార్వతీపురం సెక్షన్ అధికారి 9493399467, ఏనుగుల పర్యవేక్షణ విభాగం రేంజ్ అధికారి 9440821237 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

సాగు నీరు విడుదల

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు 700 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నారు. దీని ద్వారావంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగడాం మండలాల్లో 24,700 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు కారణంగా ఆయకట్టు భూముల్లో రైతులు సాగునీటి ఇబ్బందులు పడకుండా పుష్కలంగా సాగునీటిని అందిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ నితిన్ ఆదివారం వెల్లడించారు.

విషాదం..



సంఘటనా స్థలంలో సహాయక చర్యలు

ఆ పాసింజర్ రైళ్లలో ప్రయాణికులంతా అప్పటి వరకు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణిస్తున్నారు. ఇంతలోనే ఒక్కసారిగా పెద్ద శబ్దం... ఎటు చూసినా చిమ్మ చీకటి... ఏమైందో తెలిసేలోపే పలు బోగీలు పట్టాలు తప్పి పడిపోయాయి. కొన్ని బోగీలు నుజ్జయ్యాయి... ఏం జరిగిందో తలుచుకుంటూ రోదనలు.. వాటి కింద కొందరు చిక్కుకుని మృతి చెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు క్షతగాత్రులయ్యారు. క్షతగాత్రుల ఆక్రందనలు.. హాహాకారాలతో... ఆ ప్రాంతంలో భయానక పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే...

12 మంది మృత్యువాత

100 మందికి పైగా గాయాలు

- అలమండ సమీపంలో పాసింజర్ రైళ్ల ఢీ
- పలాస పాసింజర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన రాయగడ పాసింజర్
- విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి 38 మంది క్షతగాత్రుల తరలింపు
- విశాఖ కేజీహెచ్‌కు, ప్రైవేటు ఆస్పత్రులకు మరి కొంతమంది తరలింపు
- సహాయక చర్యలను పర్యవేక్షించిన మంత్రి బొత్స, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు
- క్షతగాత్రుల తరలింపులో సేవలు అందించిన 108 అంబులెన్సులు

విజయనగరం ఫోర్ట్/కొత్తవలస/జామి:

బంధువుల ఇంటికి కొంతమంది బయలుదేరారు. విశాఖపట్నంలో కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వెలుతున్నవారు మరి కొంతమంది రైలు ఎక్కారు. కొద్ది క్షణాల్లో గమ్య స్థానానికి చేరుకుంటారని అందరు భావించారు. ఇంతలోనే ఘోర ప్రమాదం జరిగిపోయింది. కళ్లు తెరిచి చూసే లోపే పెను విషాదం చోటు చేసుకుంది. ఈ మహా విషాద ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖ – పలాస పాసింజర్ రైలు కొత్తవలస నుంచి బయలుదేరింది. దాని వెనుకన విశాఖ రాయగడ – పాసింజర్ రైలు విశాఖ నుంచి బయలు దేరి రాయగడ వెలుతుంది. అలమండ రైల్వేస్టేషన్ సమీపానికి వచ్చేసరికి ముందు వెలుతున్న పలాస పాసింజర్‌ను వెనుక నుంచి రాయగడ పాసింజర్ ఢీకొట్టింది. దీంతో పలాస పాసింజర్ మూడు బోగీలు, రాయగడ పాసింజర్ మూడు బోగీలు నుజ్జు, నుజ్జు అయ్యాయి. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు రైలు నుంచి బయటకు తుళ్లి పోయారు. మరి కొంతమంది బోగీల మధ్య ఇరుక్కు పోయారు. ప్రమాదంలో 12 మంది మృత్యువాత పడ్డారు. 100 మందికి పైగా గాయపడ్డారు.

సంఘటన స్థలానికి మంత్రి బొత్స

అలమండ వద్ద ప్రమాదం జరిగిందన్న విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికాపాటిల్, రైల్వే డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ అక్కడకు చేరుకుని సహాయక చర్యలను దగ్గర ఉండి పర్యవేక్షించారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులు ద్వారా ఆస్పత్రులకు తరలించారు. ఆధునాతన యంత్రాలతో బోగీలను కట్ చేసి అందులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

సంఘటన స్థలం వద్ద, ఆస్పత్రిల్లో మిన్నంటిన రోదనలు

రైల్వే ప్రమాదం జరిగిన చోట, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లోను క్షతగాత్రుల హాహాకారాలు మిన్నంటాయి. రైలు బోగీల్లో క్షతగాత్రులు చిక్కుకు పోవడంతో నొప్పులు భరించలేక హాహాకారాలు చేసారు. అలమండ వద్ద జరిగిన ప్రమాద స్థలి నుంచి క్షతగాత్రులను విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి 108 అంబులెన్సులు ద్వారా తరలించారు. 20 అంబులెన్సుల సిబ్బంది విరామం లేకుండా క్షతగాత్రులను తరలించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రుల రోదనలు మిన్నంటాయి.



ప్రమాద ఊహాచిత్రం



ఆస్పత్రిలో పర్యవేక్షిస్తున్న కోలగట్ల

రైలు ప్రమాద బాధితులను పరామర్శించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఆదివారం రాత్రి పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలు గురించి సూపరింటెండెంట్ అనిలాసునందనిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చేరిన వారందరికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

50 మంది వైద్యులతో చికిత్స

రైలు ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు అప్రమత్తం అయ్యారు. 50 మంది వైద్యులను, 50 మంది వరకు పారా మెడికల్ సిబ్బందిని సిద్ధం చేసి క్షతగాత్రులు ఆస్పత్రికి రాగానే వారికి అవసరమైన చికిత్సను అందించారు. ఓపీకి ప్రత్యేకంగా రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఓపీ చీటీలు అందించారు. అదే విధంగా వైద్య పరీక్షలు, ఎక్సరే, స్కానింగ్ ఇలా అన్ని చకచకా క్షతగాత్రులకు చేసారు. చిన్న, చిన్న శస్త్రచికిత్సలు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసారు.



జి.లక్ష్మి మృతదేహం

పలు రైళ్ల దారి మళ్లింపు

విజయనగరం టౌన్: కంటకాపల్లి – అలమండ రైల్వేస్టేషన్ల మధ్య జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా పలు రైళ్లను దారి మళ్లించినట్లు సీనియర్ డీసీఎం ఎకె.త్రిపాఠి ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. టిట్లాఘర్, రాయపూర్, నాగపూర్, బల్లార్ష, మీదుగా విజయవాడ చేరుకుంటాయని తెలిపారు. రైలు నెంబర్ 03357 బారునీ – కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ స్పెషల్, రైలు నెంబర్ 18189 టాటా ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్, రైలు నెంబర్ 11020 భువనేశ్వర్ – సీఎస్‌టీ ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్, రైలు నెంబర్ 12703 హౌరా – సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, 12245 హౌరా – ఎస్‌వీఎమ్ బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్టు పేర్కొన్నారు. అదే విధంగా రైలు నెంబర్ 08527 రాయపూర్ విశాఖ ప్యాసింజర్, 08528 విశాఖ – రాయపూర్ రైలును రద్దు చేసినట్టు తెలిపారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

విజయనగరం టౌన్: అలమండ – కంటకాపల్లి రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకున్న రైళ్ల ప్రమాదానికి సంబంధించి అధికారులు ఎక్కడికక్కడ హెల్ప్‌లైన్ కేంద్రాలను అందుబాటులో ఉంచారు. ప్రమాదానికి గురైన రైలు నెంబర్ 0532 విశాఖ – పలాస ప్యాసింజర్ స్పెషల్ విజయనగరం రాత్రి 7.05 గంటలకు చేరుకోవాల్సి ఉంది. అదేవిధంగా వెనుక నుంచి వచ్చిన రైలు 08504 విశాఖపట్టణం – రాయగడ ప్యాసింజర్ స్పెషల్ రాత్రి 7.20 గంటలకు విజయనగరం చేరుకోవాల్సి ఉంది. రెండు ప్యాసింజర్ రైళ్లు ప్రమాదానికి గురవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందించడం కోసం విజయనగరంలో 08922 – 221206, 221202 , చీపురుపల్లిలో 08942 – 286213, 286245, విశాఖలో హెల్ప్‌లైన్ 0891 – 2746330, 2744619, రాయగడలో హెల్ప్‌లైన్ 94397 41031, 73268 12986 నంబర్లను సమాచారం నిమిత్తం ఏర్పాటు చేశారు.

సర్వజన ఆస్పత్రిలో చేరిన క్షతగాత్రుల వివరాలు

ముద్రు వెంకటరావు, ముద్రు లక్ష్మి(తురువోలు), మర్రాపు సూర్యనారాయణ (పణుకవలస), రెడ్డి రాము (ఎం.అలమండ), దుంగల అమ్మాజీ (నాయుడు పాలేం), బి.గజ్జలనాయుడు(వెంకటరాజు పాలేం), జె.బంగారుతల్లి, మజ్జి అమృత(జి.సిగడాం), మజ్జి మోక్ష , మజ్జి సూర్యకాంతం, మజ్జి రమణ, కీర్తి రాములమ్మ, టంకాల సుగణమ్మ(మెట్టవలస), జి.మహాలక్ష్మినాయుడు, పి.గౌరునాయుడు (కాపు సంభాం), రెడ్డి శంకర్ (రెడ్డి పేట), నల్ల కుమారి (అలమండ), జి.మురళి, జి.ప్రభావతి (కొండ లక్ష్మీపురం), ప్రణీతి, జ్ఞానేశ్వరి (కొండ లక్ష్మీపురం), ఎస్.పార్వతి, ఎం.తిరుపతిరావు, కామేశ్వరావు, సవర బుజ్జి, సవర రాయప్ప (పాలకొండ), మహంతి ఆదిలక్ష్మి, తేజ (జి.సిగడాం), కె.రమణచారి, జె.కృష్ణ, జె.మిశ్రా, జె కోమలిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అదే విధంగా తిరుమల మెడికవర్‌లో ఇద్దరు, ఎస్ఆర్‌ఐ ఆస్పత్రిలో ఒకరు చేరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆ దృశ్యాలు.. అదృశ్యం కావేమో..!

- **13** — 2013: విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం వద్ద రైలు నుంచి పొగలు వస్తున్నాయని చైను లాగి ప్రయాణికులు పట్టాలు దాటి పరిగెడుతుండగా పక్క ట్రాక్‌పై వస్తున్న మరో రైలు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో 13 మంది చనిపోయారు.
- **40** — 2017 జనవరి: పార్వతీపురంలోని కూనేరు వద్ద జరిగిన ఘటనలో 40 మంది ప్రయాణికులు మృతి చెందారు.
- **5** — 2022: జి.సిగడాం మండలం బాతువ వద్ద కోయంబత్తూరు రైలు నుంచి పొగలు వస్తుండటంతో ప్రయాణికులు రైలు చైను లాగి పక్క ట్రాక్‌పైకి పరుగెత్తారు. అదే సమయంలో అటు నుంచి వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఐదుగురు ప్రయాణికులు చనిపోయారు.
- **275** — 2023 జూన్: ఒడిశాలో జరిగిన కోరమండల్ రైలు ప్రమాదంలో 275 మందికి పైగా ప్రయాణికులు మృతిచెందారు.

సత్తా చాటుదాం..



మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- సాలూరు గడ్డ వైఎస్సార్‌సీపీ అడ్డా..
- నవంబర్ 8న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దాం
- మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ,శ్రేణులు

సాలూరు: రాష్ట్రంలో వచ్చే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ జగనన్న అడ్డా అని మరోసారి చాటి చెబుదామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. నవంబర్ 8న సాలూరులో జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్ర సన్నాహక సమావేశం పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి బొత్స రానున్న ఎన్నికల్లో సాలూరు గడ్డ వైఎస్సార్‌సీపీ అడ్డా అని నిరూపించేలా రాజన్నదొరను అఖండ మెజార్టీతో గెలిపించడానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోని 99 శాతం అమలు చేసిన దేశంలో తొలి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అందుకే పార్టీ నేతలంతా ప్రజల వద్దకు ధైర్యంగా వచ్చి సంక్షేమం , అభివృద్ధి కోసం ప్రజలకు చెబుతున్నామన్నారు. ఇది దేశ చరిత్రలో ఓ నూతన అధ్యాయమన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఈ రాష్ట్రానికి ఎందుకు ముఖ్యమంత్రి కావాలో ప్రజలకు వివరించాలన్నారు. పచ్చ పార్టీలు, పచ్చ మీడియా దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. జగనన్న పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధి గణనీయంగా మెరుగుపడిందన్నారు. సాలూరులో నవంబర్ 8న జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని, 9వ తేదీన ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాలు ఎగురవేయాలని అన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

అంతకు ముందు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేసారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అన్ని వర్గాల వారికి న్యాయం చేసారని అన్నారు. దానిని ప్రజలందరికి చెప్పాల్సిన అవసరం మనపై ఉందన్నారు. డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా లక్షల కోట్ల రుపాయిలను వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రజలకు జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారని కూలంకుషంగా ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎవరి హయాంలో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందో అనే అంశంపై తానే చర్చకు వస్తానని, టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని రాజన్నదొర మరోసారి సవాల్ విసిరారు. వచ్చే నెల 8వ తేదిన పట్టణంలో వైఎస్సార్ కూడలి వద్ద జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ మాట్లాడుతూ, ప్రజలకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని అన్నారు. అర్హతే ప్రామాణికంగా, అవినీతి రహితంగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు వెంపాడ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో సాలూరులో రాజన్నదొర నాయకత్వంలో మరలా వైఎస్సార్‌సీపీ విజయదుందుభి కొనసాగిద్దామని అన్నారు. నిజమైన గిరిజనుడైన రాజన్నదొర పాలనను సాలూరు నియోజకవర్గ ప్రజలు చూసారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజన్నదొర ఆధ్వర్యంలో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. అవినీతి చేసిన చంద్రబాబు జైలుకు వెళ్తే సానుభూతి కోసం టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేసారు.

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజన్నదొర నేతృత్వంలో సాలూరులో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతున్నదని వివరించారు. జిల్లాలో అత్యధిక సాగునీటి ప్రాజెక్టులు ఉన్న ఏకైక నియోజకవర్గం సాలూరు కావడం అందుకు నిదర్శనమని తెలిపారు. వచ్చే నెల 8న పట్టణంలో జరగబోయే సామాజిక సాధికార యాత్రను, జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రాకు మరలా ముఖ్యమంత్రి ఎందుకు కావాలో కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీ సాధించేలా సమష్టిగా కృషి చేయాలని అన్నారు.

క్లుప్తంగా

సాయికుమార్‌కు జ్ఞాన సరస్వతీ విశిష్ట పురస్కారం



జ్ఞాన సరస్వతీ విశిష్ట పురస్కారం అందుకుంటున్న సాయికుమార్ దంపతులు

విజయనగరం టౌన్: ప్రముఖ చలన చిత్ర నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ పూడిపెద్ది సాయికుమార్‌కు జ్ఞానసరస్వతీ విశిష్ట పురస్కారాన్ని ఆదివారం రాత్రి స్థానిక జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయ ఆవరణలో శారదా సేవాసంఘం ఆధ్వర్యంలో అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాయికుమార్‌తో పాటు ఆయన సతీమణి సురేఖను సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత సాయికుమార్ మాట్లాడుతూ, జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆశీస్సులు తనకు లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్‌కు గాయాలు



గాయాలపాలైన ఆటో డ్రైవర్ అప్పారావు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి ఆటోస్టాండ్ సమీపంలో కారు ఢీ కొని దత్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.అప్పారావు గాయాలపాలయ్యాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి గజపతినగరం వస్తున్న కారు పెదమానాపురం సంత నుంచి కోమటిపల్లి ఆటోస్టాండ్‌కు వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన ఆటో డ్రైవర్‌ను 108లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైజాగ్ కేజీహెచ్‌కు తరలించినట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు తెలిపారు.

మారథాన్‌లో వంగర యువకుడి సత్తా



నాల్గవ స్థానంలో నిలిచిన అథ్లెట్ నాచు గోవర్ధనరావు

వంగర: ఐరన్ మేన్ రన్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన హాఫ్ మారథాన్ పోటీలో వంగర మండల మడ్డువలస పంచాయతీ జగన్నాథవలస గ్రామానికి చెందిన అథ్లెట్ నాచు గోవర్ధనరావు సత్తాచాటాడు. వివిధ దేశాలకు చెందిన అథ్లెట్‌లతో పోటీపడి నాల్గవ స్థానంలో నిలవడంతో నిర్వాహకులు మెమెంటో, నగదు బహుమతి అందించారని గోవర్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదాతకు ఆనందం..

తొలేళ్ల సంబరం

తొలేళ్ల సంబరాలు అంటే రైతన్నల మోములో ఆనందం. ఈ పండగ రైతన్నల కోసమే నిర్వహిస్తారు. సిరులిచ్చే తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు నెల రోజుల పండగలో తొలి కీలక ఘట్టం తొలేళ్ల సంబరం. అమ్మవారిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. తొలేళ్ల సంబరానికి తెరలేచింది. సోమవారం నిర్వహించనున్న ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ కెఎల్.సుధారాణి పేర్కొన్నారు.

- నేడు పైడితల్లి తొలేళ్ల ఉత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించనున్న పూసపాటి వంశీయులు, మంత్రులు
- ఉచిత దర్శనాలతో పాటూ ప్రత్యేకంగా రూ.300 టికెట్లు లభ్యం
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి : ఆలయ ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆ తల్లి చల్లని ఆశీస్సుల కోసం భక్తులు ఎదురు చూస్తుంటారు. అమ్మవారి అనుగ్రహంతో వచ్చిన విత్తనాలను వేసి నాగలి(ఏరు)తో తొలిత దున్నాలి. దానినే తొలి ఏరు అని... తొలేళ్లనీ పిలుస్తారు. సిరిమానోత్సవానికి ముందురోజు ఈ పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. రైతన్నలు తాము వేసిన పంటలకు ఎటువంటి విపత్తులూ, చీడపీడల బాధలూ ... దరి చేరకూడదని కోరుకుంటారు. వారి కోసం నిర్వహించేదే ఈ తొలేళ్ల ఉత్సవం. తొలేళ్ల రోజు రాత్రి చదురుగుడి నుంచి అమ్మవారి ఘటాలను కోటలోకి తీసుకువెళ్తారు. అక్కడ కోటకి పూజలు చేసి, అమ్మవారి ఆశీర్వచనం పొందిన విత్తనాలను బస్తాలతో ఉంచుతారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు చేతులతో ఆ విత్తనాలను అందించి అమ్మవారు ఆశీర్వదిస్తారు. ఆ విత్తనాలను తీసుకున్న రైతులు తమ విత్తనాల బస్తాలలో కలిపి పొలాల్లో చల్లుతారు. తద్వారా మంచి దిగుబడులు సాధిస్తారు.

సకల కళల సమాహారమైన విజయనగరంలో పైడితల్లి అమ్మవారి తొలేళ్ల జాతరకు ప్రత్యేకత ఉంది. తొలేళ్ల రోజు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ ప్రజలు సంబరాలు నిర్వహిస్తూనే ఉంటారు. పండగ రోజుల్లో మొక్కుబడులు చెల్లించేందుకు వచ్చే భక్తులతో పండగ శోభ సంతరించుకుంది. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ప్రదేశం, మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ప్రాంతమంతా విద్యుత్ అలంకరణలతో శోభాయమానంగా అలరారుతోంది. భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పిస్తూనే.. పసుపు, కుంకుమలతో మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు.

అందరికీ అమ్మ దర్శనభాగ్యం

భక్తులందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కలిగే విధంగా ఈ ఏడాది క్యూలైన్లను వివిధ విభాగాలుగా చేశారు. ఆలయానికి ఇరువైపులా దివ్యాంగులకు, వయోవృద్ధులకు, ఘటాలకు ప్రత్యేకంగా క్యూలైన్లు పెట్టారు. ఉచిత దర్శనాలతో పాటూ రూ.50 టికెట్ అందుబాటులో ఉంది. తొలేళ్ల రోజు ఉదయం నుంచి మంగళవారం సిరిమానోత్సవం రోజున ఉదయం 6 గంటల వరకూ అమ్మవారిని దర్శించుకునేందుకు రూ.300 టికెట్లు మూడువేల వరకూ అమ్మకాలు చేస్తున్నారు. వివిధ రకాల పుష్పజాతులతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేసే పనిలో కొందరుంటే ప్రసాదాల తయారీలో మరికొందరు ఇలా తలా బాధ్యత అమ్మవారి సేవలో నిమగ్నమయ్యారు. చల్లని తల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, అధికారులు, నాయకులు సన్నద్ధమయ్యారు.

తొలేళ్ల రోజు ప్రధాన ఘట్టాలు

- వేకువజామున మూడు గంటల నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు,అర్చనలు.



- ఉదయం 8గంటలకు రాజవంశీకులు, మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు.
- రాత్రి 10.30 గంటలకు భాజా భజంత్రీలతో అమ్మవారి ఘటాలకు పూజలు చేసేందుకు కోటలోకి పూజారులు వెళ్తారు. కోటశక్తికి, అమ్మవారి ఘటాలకు పూజాధికాలు చేస్తారు.
- ఘటాలను తిరిగి చదురుగుడి వద్దకు తీసుకువచ్చి గుడి ఎదురు బడ్డీలా చేసిన చిన్న బల్లపైన భక్తుల సౌకర్యార్థం ఉంచుతారు. అమ్మవారి దర్శనానికి అవకాశం లేని వారందరూ అక్కడే పసుపు, కుంకుమలను సమర్పించి, మొక్కులు చెల్లిస్తారు.
- ఘటాలను తీసుకువచ్చిన తర్వాత పూజారి అమ్మవారి చరిత్ర చెప్పి రైతులకు ధాన్యాన్ని పంచుతారు. రైతులు ఆ విత్తనాల కోసం బారులు తీరుతారు.

'మెరుగై'న సేవకులు

- పసిడితల్లి ఆభరణాలకు పాలిష్
- పదేళ్లుగా సేవలందిస్తున్న స్వర్ణకారులు



అమ్మవారి ఆభరణాలకు మెరుగుపెడుతున్న దృశ్యం



వెండి బిందెలను పాలిష్ చేస్తున్న స్వర్ణకారులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆభరణాలకు మెరుగులు దిద్దేందుకు స్వర్ణకారులు రంగంలోకి దిగారు. గడిచిన పదేళ్లుగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో ఉన్న వెండి ఆభరణాలను ఆయా ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని కమిటీ సభ్యులు, ఆలయాల అధికారులు ఇచ్చిన అవకాశం మేరకు ఉచితంగా ఆభరణాలకు జిల్లాకు చెందిన స్వర్ణ సేవకులు మెరుగులు దిద్దుతున్నారు. పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి అలంకరణ చేసిన వెండి ఆభరణాలు, అదేవిధంగా పంచహారతులిచ్చే వస్తువులకు ఉచితంగా మెరుగులు దిద్దేందుకు గానూ 15 మంది స్వర్ణకారులు రంగంలోకి దిగారు. ఆలయ అధికారులకు తాము చేస్తున్న సేవలను వివరించి, వారినుంచి పర్మిషన్ తీసుకుని, ఆలయ ఆవరణలోనే వెండి ఆభరణాలకు పూర్తిగా మెరుగులు దిద్దారు. వనంగుడి, చదురుగుడి ఆవరణలలో అమ్మవారి వెండి వస్తువులైన పీటలు, కవచాలు, మకరతోరణాలు, హారతులు, వెండి తలుపులు, వంటివన్నీ తళతళ మెరిసేలా వారి నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు అందుకుంటున్నారు.

బతికి ఉన్నంతకాలం సేవకు సిద్ధం



మేమంతా స్వర్ణకార వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. జీవించి ఉన్నంతకాలం ఆ తల్లి సేవ చేసుకుంటాం. పదేళ్లుగా సేవలందిస్తున్నాం. అమ్మవారి వెండి వస్తువులన్నీ నల్లగా ఉండడంతో వాటికి మెరుగులు దిద్దేందుకు పర్మిషన్ తీసుకుని పని ఆలయ ఆవరణలోనే చేస్తున్నాం. 15 మంది స్వర్ణకారులం తల్లిసేవ చేసుకుంటున్నాం. ఏ ఆలయమైనా సరే ఉచితంగా తమ సేవలను పొందాలంటే ఫోన్ 9393108160 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.

– నానాజీ, స్వర్ణకారుడు

అందుబాటులో వైద్యసిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్స కేంద్రాల వద్ద నియమించిన వైద్య సిబ్బంది నిర్దేశిత సమయాల్లో అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్.సూర్యనారాయణ అన్నారు. విజయనగరం ఉత్సవాల సందర్భంగా స్థానిక సంగీత కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రథమ చికిత్స కేంద్రం వద్ద ఒక వైద్యుడు, ఇద్దరు పారామెడికల్ సిబ్బందిని నియమించామన్నారు. జిల్లా కేంద్రంలో 14 ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 వరకు 14 కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యరాజ్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

భక్తులతో దురుసు ప్రవర్తన వద్దు

- విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి
- పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ సూచనలు



అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: విజయనగర ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవం సందర్భంగా బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది భక్తులతో దురుసుగా ప్రవర్తించరాదని, విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ ఎం.దీపిక సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండగను తిలకించేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ప్రజలు, భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ఎవరితోనూ తగాదాలు పడవద్దని హితవు పలికారు. వారితో మాట్లాడే సమయంలో సంయమనం పాటించాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత ఇన్‌చార్జ్‌లో దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. సమస్యను సానుకూలంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించే విధంగా అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని కోరారు.

మూడు షిఫ్టుల్లో విధులు

ప్రతి ఏడాది నిర్వహించే పండగ బందోబస్తేనని ఎవరూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ప్రతి ఏడాది బందోబస్తు విధులు రెండు షిఫ్టుల్లో నిర్వహించేవారని, సిబ్బంది సౌలభ్యం, విధి నిర్వహణలో కచ్చితత్వం కోసం ఈ ఏడాది మూడు షిఫ్టుల్లో బందోబస్తు విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఎవరు ఏ తరహా విధులు నిర్వహించాలో ఇప్పటికే సిబ్బంది, అధికారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏమైనా సందేహాలు, సలహాలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిరిమానోత్సవంలో ప్రెజర్ పాయింట్స్ అయిన పాత సోనియా జంక్షన్, కస్పా జంక్షన్, గురజాడ రోడ్డు వంటి ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించామని చెప్పారు. సిరిమాను వెంట అనధికార వ్యక్తులు తిరగకుండా క్లియరెన్స్ పార్టీలను ఏర్పాటుచేశామని, డీఎస్పీ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించి, ఆయన పర్యవేక్షణలో ముగ్గురు సీఐలు పనిచేసేలా చర్యలు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ



హుకుంపేటలో సిరిమాను తరలించే ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

పైడితల్లమ్మ వారి పండగ బందోబస్తు నిమిత్తం ఏర్పాటుచేసిన ప్రతి పాయింట్‌ను ఎస్పీ ఎం.దీపిక ఆదివారం సాయంత్రం పర్యవేక్షించారు. సిరిమాను తిరిగే మూడులాంతర్లు నుంచి కోట జంక్షన్ మధ్య ప్రాంతాలను ఆలయ పరిసర ప్రాంతాలు, హుకుంపేట నుంచి ఆలయం మధ్య సిరిమాను తరలించే ప్రాంతాలను పరిశీలించారు. హుకుంపేట నుంచి సిరిమాను, పూజారి తరలింపులో ఎటువంటి ఆలస్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బందోబస్తు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకుని, వారి సందేహాలను క్షేత్రస్థాయిలో నివృత్తి చేశారు. షిఫ్ట్ డ్యూటీలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. అమ్మవారి దర్శనం కోసం ఆలయం వెనుక భాగం నుంచి ఎవరినీ, ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, పి.శ్రీధర్, ఏఎస్.చక్రవర్తి, ఆర్.శ్రీనివాసరావు, డి.విశ్వనాథ్, ఎల్.మోహనరావు, వీరకుమార్, వి.వెంకట అప్పారావు, యూనివర్స్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా పుష్ప, ఫల ప్రదర్శన

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



పుష్ప, ఫల ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పుష్ప, ఫల ప్రదర్శన అద్భుతంగా ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక సంగీత కళాశాల వద్ద ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుష్ప, ఫల ప్రదర్శనను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో ఏర్పాటు చేసిన వాటిని తిలకించారు. ఉత్సవాలకు, అమ్మవారి జాతరకు వచ్చే ప్రజలు తిలకించేందుకు వీలుగా రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేసిన చోట పూర్తి స్థాయిలో మేట్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పుష్ప, ఫల ప్రదర్శన విజ్ఞానందదాయకంగా ఉందని సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి , జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎస్పీ దీపిక పాటిల్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, ఎ.డి శైలజ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతిచెందిన కొయ్యాన రాము(ఫైల్)

రాజాం సిటీ: మండల పరిధి ఎం.జోగివలస గ్రామానికి చెందిన కొయ్యాన రాము (24) శనివారం రాత్రి అగ్నిప్రమాదానికి గురై విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శనివారం రాత్రి చీకటిపేట జంక్షన్ వద్ద తోటపల్లి కాలువ గట్టుపై బైక్ అదుపుతప్పి పడిపోయింది. అప్పటికే బైక్‌లో బాటిల్‌తో ఉన్న పెట్రోల్ ఆయనపై పడిన వెంటనే మంటలు అంటుకుని వళ్లంతా కాలిపోయింది. వెంటనే పక్కనే ఉన్న కాలువలో దూకి ఒడ్డుకు చేరలేకపోయాడు. ఉదయం కాలువవైపు స్నానానికి వచ్చిన స్వాములు బాధితుడిని గమనించి 108కు సమాచారం అందించారు. వారు వచ్చి రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోలీసులకు బాధితుడు జరిగిన విషయాన్ని వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య భారతి, తల్లి కల్యాణి, తండ్రి గోవింద ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు.

ఆకట్టుకుంటున్న డ్వాక్రా బజార్

- 18 రాష్ట్రాలకు చెందిన 251 స్టాల్స్ ఏర్పాటు
- హస్తకళలు, వస్త్రాలు, అలంకార వస్తువుల ప్రదర్శన



అఖిల భారత డ్వాక్రా బజార్‌లో సందర్శకుల తాకిడి



హ్యాండీ క్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయాలు

విజయనగరం అర్బన్: అఖిల భారత డ్వాక్రా బజార్ పేరుతో స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డును ఆనుకుని ఉన్న మాన్సాస్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయశాల పట్టణవాసులను ఆకట్టుకుంటోంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సరస్ (సేల్స్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిషన్ సొసైటీ) పరిధిలోని వివిధ రాష్ట్రాలకు, రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళల తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులతో సుమారు 251 స్టాల్స్‌ను ఈ బజార్‌లో ఏర్పాటు చేశారు. తొలిరోజున సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రధానంగా హ్యాండీ క్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయాలు అధికంగా జరిగాయి. మరో వైపు సందర్శకుల పిల్లలను ఆహ్లాదపరిచేందుకు ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు పర్యవేక్షణలో ఈ ప్రదర్శన వచ్చే నెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అలరించిన ఆనందోబ్రహ్మ

విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక భాష్యం స్కూల్ పక్కన ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహుతులను కట్టిపడేశాయి. కమెడియన్ జబర్దస్త్ అప్పారావు, సీరియల్ నటులు కార్యక్రమాలను వీక్షించారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి. అయిగిరినందిని భక్తిగీతానికి చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనకు ఆహుతుల కరతాళ ధ్వనులు మిన్నంటాయి. ఆనందోబ్రహ్మ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పీఎస్.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈవెంట్ సీఈఓ సరగడ తులసి, రామారావు, కృష్ణారెడ్డి, సంధ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సిమ్మింగ్ పూల్‌లో పడి యువకుడి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): మద్యం మైకంలో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో తోటి స్నేహితుడి మరణానికి కారణమయ్యాడు మరో స్నేహితుడు. పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన కొండకర్లలోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో శనివారం రాత్రి స్విమ్మింగ్ పూల్‌లో పడి విజయనగరానికి చెందిన యువకుడు సాయివర్మ మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.

మద్యం మత్తులో గంతులేస్తూ..

ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న 30 మంది స్నేహితులు కొండకర్లలోని ప్రైవేట్ రిసార్ట్‌లో శనివారం సందడి చేశారు. స్నేహితుల్లో కొందరు మద్యం తాగి స్విమ్మింగ్ పూల్ వద్ద నృత్యాలు చేశారు. ఆ సమయంలో సాయివర్మను మరో స్నేహితుడు సిమ్మింగ్ పూల్‌లోకి తోసేశాడు. నీటిలో పడిపోయిన సాయివర్మకు ఈత రాకపోవడమో లేక మద్యం మత్తు కారణ మో గానీ కొంత సేపటికి స్విమ్మింగ్ పూల్‌లో తేలిపోయాడు. అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. సాయివర్మను ఆస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తొలుత అతిగా మద్యం తాగడం వల్లే నీటిలో మునిగి చనిపోయాడని భావించినప్పటికీ సీసీ పుటేజ్ దృశ్యాలను చూసిన తర్వాత పోలీసులు ఘటనకు సంబంధించిన కారణాన్ని గుర్తించారు. పార్టీలో ఎంజాయ్ చేస్తూ స్నేహితుడే సాయివర్మను నీటిలోకి తోసేసినట్లు గుర్తించారు. అయితే ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటన కాదని భావించిన పోలీసులు సాయంత్రం తర్వాత కేసు నమోదు చేశారు. ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.